క్లుప్తంగా

వావిలపల్లికి సత్కారం



రాజారావు మాస్టారును సత్కరిస్తున్న డీఈఓ తిరుమల చైతన్య

పొందూరు: పొందూరుకు చెందిన ఉపాధ్యాయుడు వావిలపల్లి రాజారావును డీఈఓ తిరుమల చైతన్య సోమవారం శ్రీకాకుళంలోని తన కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. రాజారావు మాస్టారు రాష్ట్రస్థాయి ఉగాది పురస్కారం పొందిన నేపథ్యంలో ఆయనను డీఈఓ సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నోబెల్ టీచర్ అసోసియేషన్ అధ్యక్షుడు సూర పాపారావు, డీటీఎఫ్ సంఘ నాయకులు టి.మురళి, పూజారి రాధాకృష్ణ, ఎ.మాధవ్, ఎ.వేణు, ఎస్.లక్ష్మణరావు, పీవీ రామరాజు, తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బపై అప్రమత్తం



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి ఉమాగౌరి

పాతపట్నం: వడదెబ్బపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని హోమియో వైద్యాధికారి ఎస్.ఉమాగౌరి అన్నారు. మండలంలోని తెంబూరు గ్రామంలో ఉపాధి హామీ పనులు చేపడుతున్న వేతనదారులకు వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వేసవిలో వ్యాధుల ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ



విత్తనాలు అందజేస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

బూర్జ: మండలంలోని పాలవలస రైతు సేవా కేంద్రంలో రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను ఏఓ ఎస్.శ్రీనివాసరావు సోమవారం పంపిణీ చేశారు. జీలుగు, కట్టిజనుము, తదితర పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు తమ ఆధార్ కార్డు తీసుకువచ్చి సంప్రదించాలన్నారు. 10 కిలోల విత్తనాలు బ్యాగ్ రకాన్ని బట్టి రూ.560, రూ.630లకు అందజేయడం జరుగుతుందన్నారు. పలువురు నాయకులు, వ్యవసాయ సహాయకురాలు హేమలత పాల్గొన్నారు.

రూ.22 లక్షలతో పనులు చేపడతాం

కొత్తూరు: మండలంలోని అలికాం–బత్తిలి రోడ్డు దాశరదీపురం కూడలి సమీపంలో ఏర్పడిన గోతులపై సాక్షిలో ఈ నెల 4వ తేదీన నాణ్యతకు తిలోదకాలు అనే వార్త వెలువడింది. ఈ వార్తపై శ్రీకాకుళం ఆర్అండ్‌బీ పర్యవేక్షణ ఇంజినీర్ స్పందించారు. ఈ రోడ్డు పనుల కోసం ఎస్‌డీఎంఎఫ్ కింద రూ.22 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. టెండర్ల ప్రక్రియ పూర్తి చేశామని, త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు.

పగలే వెలుగులు



పట్టపగలే వెలుగుతున్న వీధి దీపాలు

సారవకోట: మండలంలోని గొర్రిబంద పంచాయతీ కోనవానిపేట గ్రామంలో వీధి దీపాలు పట్టపగలే నిత్యం వెలుగుతున్నాయి. గత కొంత కాలం నుంచి విద్యుత్ సరఫరా లేని సమయంలో తప్ప.. రోజంతా బల్బులు వెలుగుతూ ఉంటున్నాయని స్థానికులు తెలిపారు.

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

హిరమండలం: మండలంలోని దుర్బలాపురం గ్రామానికి చెందిన రాష్ట్ర స్థాయి పోటీ పరీక్షల నిపుణుడు ముద్దాడ బాలరాజు రచించిన డీఎస్సీ కాంపిటేటివ్.. ఎస్అండ్ఎస్ పబ్లికేషన్ 'ట్రై మెథడ్స్' పుస్తకాన్ని సోమవారం పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మన ప్రాంతానికి చెందిన విషయ నిపుణుడు బాలరాజు రెండు తెలుగు రాష్ట్రాల్లో నిరుద్యోగులకు అవగాహన కల్పిస్తున్నారన్నారు. పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు రాస్తూ పేరు ప్రఖ్యాతలు సంపాదించడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వేసవి దుక్కులకు.. ఇదే అదును..



కొమర్తి వద్ద ట్రాక్టర్‌తో దుక్కి చేస్తున్న రైతు

- మేలు చేసిన వర్షాలు..
- పొలాలను దుక్కిచేస్తున్న రైతులు

నరసన్నపేట: ఈదురుగాలులు ఒకవైపు కొంతమేర నష్టపెట్టగా.. మరోవైపు వర్షాలు రైతుకు మేలు చేశాయి. వరుసగా మూడు రోజులు వర్షాలు కురవడంతో భూమిలో నీరు బాగా ఇంకింది. ప్రస్తుతం ఒక్కోవైపు నుంచి పొలాలు పదును ఇస్తుండటంతో రైతులు దుక్కులు చేపడుతున్నారు. జూన్ నుంచి వరి విత్తనాలు వేస్తారు. ఈలోగా పదునుల మేరకు వేసవి దుక్కులు చేస్తుంటారు. నరసన్నపేట మండలంలో 8 వేల హెక్టార్లలో వరి పంట రైతులు రానున్న సీజన్‌లో ఆశించే అవకాశం ఉంది. దాదాపు అన్ని గ్రామాల్లో వర్షం పడటంతో మరో మూడు, నాలుగు రోజుల్లో పదును బాగా వస్తుందని ముమ్మరంగా దుక్కులు చేసుకోవచ్చని వ్యవసాయశాఖ అధికారులు అంటున్నారు.

వేసవి దుక్కులతో అనేక లాభాలు..

వేసవి దుక్కులతో అనేక లాభాలున్నాయి. భూమి లోపల పొరల్లో దాగి ఉండే కీటకాలు గుడ్లు, వేసవి దుక్కులు చేయడం ద్వారా బయటపడి ఎండ తీవ్రతకు చనిపోతాయి. భూమిలో కోశస్థ దశలోని క్రిమికీటకాలు నేల పైభాగానికి రావడంతో పొలాల్లో తిరిగే కాకులు, కొంగలు, వివిధ రకాల పక్షులు వాటిని తినేస్తాయి. పంట కోత తరువాత మిగిలిన అవశేషాలు, చెత్తాచెదారం లోతుగా దుక్కులు చేయడం ద్వారా పూర్తిగా కుళ్లిపోతాయి. సేంద్రియ పదార్థంగా మారి పంటలకు బలం చేకూర్చుతాయి. కలుపు మొక్కలు చనిపోతాయి. దుక్కులతో భూమి గుల్ల బారుతుంది. దీని ద్వారా వర్షం పడిన సమయంలో భూమి లోపల నీటిని నిల్వ ఉంచుకొనే సామర్థ్యం పెరుగుతుంది. భూమి చల్లబడటం, ఆరిపోవడం జరుగుతుంది. విత్తనం విత్తేందుకు అనుకూలంగా ఉంటుంది. భూమి పొరల్లోకి గాలి బాగా వెళ్తుంది. తద్వారా సూక్ష్మ జీవులు సాంద్రత పెరిగి సేంద్రియ కర్బనం బాగా పెరుగుతుంది.

అనుకూలం..



అకాల వర్షాలు కొంత ఇబ్బంది కలిగించినా ఎక్కువగా రైతులకు మేలు చేస్తున్నాయి. మేలో వేసవి దుక్కులు చేయడం ఎంతో మేలు. ఖరీఫ్ పంటలకు ఈ దుక్కులు ఎంతో ఉపయోగంగా ఉంటాయి. వీలున్నంత వరకు దుక్కులు చేసుకోవాలి.

– కె.సునీత, వ్యవసాయాధికారి, నరసన్నపేట

పదును బాగుంది



ఇటీవల కురిసిన వర్షాలు రైతులకు కొంత మేలు చేశాయి. ప్రస్తుతం దుక్కులకు పదను బాగుంది. ఐదు ఇంచీల వరకు నాగలి భూమిలో దిగుతుంది. ట్రాక్టర్‌తో దుక్కులు వస్తున్నాయి. ప్రతిఏటా వేసవి దుక్కులు చేస్తున్నాం. దీని వలన ప్రయోజనాలు కలుగుతున్నాయి.

– పంచిరెడ్డి శివ, రైతు, గుండవల్లిపేట, నరసన్నపేట మండలం

రెండో గ్యాస్ సిలిండర్ ఇచ్చేది ఎప్పుడు?

- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎల్.ఎన్.పేట: సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని చెప్పిన సీఎం చంద్రబాబు.. ఏడాది పాలనలో ఒక్క గ్యాస్ సిలిండర్ మాత్రమే ఇచ్చారని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు రెడ్డి శాంతి సోమవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. మూడు సిలిండర్లు ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. దీపావళి సందర్భంగా మొదటి సిలిండర్ ఇస్తామని గతేడాది అక్టోబర్‌లో ప్రకటన చేశారని గుర్తుచేశారు. మొదటి సిలిండర్ ఇస్తామని ప్రకటించినప్పటి నుంచి మే వరకు ఎనిమిది నెలల కాలం అయిందన్నారు. రెండో సిలిండర్ ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. పేద, సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు ఇస్తామన్న గ్యాస్ సిలిండర్లలోనూ కూటమి ప్రభుత్వం లెక్కలు వేసుకుని ఆయా వర్గాల వారికి మోసం చేస్తుందన్నారు.

దీపావళి తరువాత సంక్రాంతి, ఉగాది వచ్చాయని ఆయా పండగలకు కూడా ఎందుకు సిలిండర్ ఇవ్వలేదని నిలదీశారు. ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయడానికి ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం అర్హులందరికీ సంక్షేమ పథకాలు ఇచ్చారని గుర్తుచేశారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నారాయణమూర్తి

పాతపట్నం: మండల కేంద్రంలోని బాలాజీనగర్–2లో తీవ్రమైన తాగునీటి సమస్య ఉందని, దీనికి శాశ్వత పరిష్కారం చూపాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బి.నారాయణమూర్తి కోరారు. జిల్లా కేంద్రంలో నిర్వహించే గ్రీవెన్స్ సెల్‌లో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. బాలాజీనగర్–2 దిగువ వైపున ఉన్న కుళాయిలకు తాగునీరు కొంతమేర వస్తుందని, ఎగువకు పూర్తిస్థాయిలో తాగునీరు అందక ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. దీనిపై మేజర్ పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతోపాటు మండల పరిషత్ కార్యాలయంలో విన్నవించినా ఫలితం లేదన్నారు.


వైభవంగా ఘటాల ఊరేగింపు



నరసన్నపేట మండలం మాకివలసలో అసిరితల్లి అమ్మవారి పండగలు వైభవంగా జరుగుతున్నాయి. ఏప్రిల్ 28వ తేదీన పండగలు ప్రారంభమయ్యాయి. దీంట్లో భాగంగా సోమవారం ఘటాల ఊరేగింపు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మంగళవారం రెండు గంటల నుంచి సిరిమాను ఊరేగింపు నిర్వహిస్తామని గ్రామస్తులు తెలిపారు.

– నరసన్నపేట


వేచి ఉండాల్సిందే..



శ్రీకాకుళం రోడ్ (ఆమదాలవలస) రైల్వే స్టేషన్ పరిధిలో ఆమదాలవలస నుంచి నరసన్నపేట తదితర ప్రాంతాలకు వెళ్లే అలికాం–బత్తిలి రహదారిపై ఊసవానిపేట వద్ద రైల్వే గేటు ఉంది. ఈ గేటు వద్ద రైళ్ల రాకపోకలతో గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. ఒక్కోసారి గేటు వేసిన తరువాత ఒకేసారి మూడు రైళ్లకు సిగ్నల్స్ ఇవ్వడంతో గంట సమయం వరకు ప్రయాణికులు వేచి ఉండాల్సి వస్తోందని వాపోతున్నారు. ఎండలో వేచి ఉండడంతో నరకం చూస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైల్వే అధికారులు స్పందించి ఆ ప్రాంతంలో అండర్ టన్నెల్ నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

– ఆమదాలవలస

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..



ఈ చిత్రం కొత్తూరులో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా మారిన పాత తహసీల్దార్ కార్యాలయం. దీంతోపాటు ఐసీడీఎస్ కార్యాలయం, పశువైద్యశాలతోపాటు అర్ధాంతరంగా నిలిచిపోయిన కార్యాలయాలు కూడా అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారాయి. జూదం, మద్యం సేవించడం, గంజాయి సేవించి హల్‌చల్ చేస్తున్నారు. ఇదే మార్గంలో ఎస్సీ బాలుర, బాలికల సవతి గృహాలు ఉన్నాయి. అధికారులు స్పందించి పాడుబడిన భవనాలను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

– కొత్తూరు

గోతులమయం..



ఈ చిత్రం కొత్తూరు మండలంలోని మెట్టూరు బిట్–1 ఆర్ఆర్ కాలనీ మలుపు వద్ద ఏర్పడిన గోతులు. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డు మలుపు వద్ద గోతులు ఏర్పడటంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గోతులను పూడ్చి ప్రమాదాలను నివారించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

– కొత్తూరు

నవధాన్యాల సాగుతో భూసారం



ఎల్.ఎన్.పేట: నవధాన్యాల కిట్లు పంపిణీ చేస్తున్న లలిత, తదితరులు

ఎల్.ఎన్.పేట: ప్రకృతి వ్యవసాయంలో భాగంగా నవధాన్యాలను సాగుచేయటం వలన భూ సారం పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయ ఎల్.ఎన్.పేట మండల యూనిట్ ఇన్‌చార్జి బి.లలిత అన్నారు. లక్ష్మీనర్సుపేటలో సోమవారం 18 రకాల విత్తనాలతో 5 కిలోల బరువు ఉండే 502 కిట్లను రైతులకు పంపిణీ చేసేందుకు సిద్ధం చేశారు. ప్రకృతి వ్యవసాయం డీపీఎం పూజారి సత్యనారాయణ ఆదేశాల మేరకు కిట్లును రైతులకు పంపిణీ చేయటంతోపాటు, సాగుపై అవగాహన కల్పిస్తామని లలిత తెలిపారు. ప్రకృతి వ్యవసాయ ఐడీఐ ఈశ్వరరావు, ఐసీఆర్పీలు, రైతులు పాల్గొన్నారు.

కొత్తూరులో..

కొత్తూరు: కొత్తూరులో 500 నవధాన్యాల కిట్లును రైతులకు కొత్తూరు వ్యవసాయ సబ్ డివిజన్ మాస్టర్ ట్రైనీ ఎస్.సూర్యనారాయణ పంపిణీ చేశారు. ఈ కిట్లుతో పలు రకాల ప్రయోజనాలు ఉంటాయన్నారు. కిట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. యూనిట్ ఇన్‌చార్జి జనార్దనరావు, సిబ్బంది పాల్గొన్నారు.



బూర్జ: నవధాన్యాల కిట్లు సిద్ధం చేసిన వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది

పాలవలసలో..

బూర్జ: మండలంలోని పాలవలస గ్రామంలో ఏఓ ఎస్.శ్రీనివాసరావు, కొత్తూరు మండలం డివిజన్ ఇన్‌చార్జి గోవిందరెడ్డి ఆధ్వర్యంలో నవధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. 5 కేజీల కిట్లు పంపిణీ చేశారు.

బ్రహ్మోత్సవాలకు వేళాయె..

- రేపటి నుంచి వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు
- చురుగ్గా ఏర్పాట్లు



వేంకటేశ్వరస్వామి మూలవిరాట్



వేంకటేశ్వర స్వామి ప్రధాన ఆలయం

నరసన్నపేట: ఆలయాలు మన సంస్కృతికి, నాగరికతకు నిలయాలుగా బాసిల్లుతున్నాయి. నరసన్నపేట పట్టణ నడిబొడ్డున గల వేంకటేశ్వరస్వామి ఆలయం ప్రాచీనమైనది. 151 ఏళ్ల క్రితం పొట్నూరు వంశీకులు ఈ ఆలయాన్ని నిర్మించారు. అప్పటినుంచి నరసన్నపేట ప్రాంత వాసులకు ఇష్టమైన దేవుడయ్యారు. తిరుమల వెంకన్నను కొలిచినట్టుగానే ఇక్కడ వేంకటేశ్వర స్వామికి భక్తులు అధిక సంఖ్యలో కొలుస్తున్నారు. భీమవరం శ్రీభాష్యకార సిద్ధాంత పీఠాధిపతి త్రిదండి రామచంద్ర రామానుజ జియర్ స్వామి ఆధ్వర్యంలో 2010లో 14 నదుల నుంచి జలాలు తీసుకువచ్చి 1008 కలశాలతో మహా కుంభాభిషేకం నిర్వహించారు. అప్పటినుంచి వేంకటేశ్వర స్వామి మరింతగా భక్తుల నమ్మకాన్ని పొందుతూ పూజలందుకుంటున్నారు.

వైభవంగా..

వైశాఖ శుద్ధి దశమి బుధవారం నుంచి వైశాఖ బహుళ చవితి ఈ నెల 16వ తేదీ వరకు చామర్తి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు చామర్తి సత్యసాయి కృష్ణమాచార్యులు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఆలయ ట్రస్టు చైర్మన్ పొట్నూరు వీరభద్రస్వామి అధ్యక్షతన ఈ కార్యక్రమం ఉంటుంది. వీరభద్రస్వామి మాట్లాడుతూ.. అప్పట్లో పొట్నూరు వంశీకులు ఆస్తులను వాటాలు వేసుకున్నప్పుడు నాలుగు వాటాలు వేసి ఒక వాటాతో వేంకటేశ్వరాలయం నిర్మాణం చేపట్టి, కొన్ని భూములను కేటాయించారు. సుమారు 200 ఎకరాల మాన్యం భూములు కోమర్తి, రామకృష్ణాపురం, యారబాడు, మడపాం, వీఎన్‌పురం గ్రామాల్లో ఉన్నాయని తెలిపారు.

రోజుకో వాహన సేవ..

ఈ నెల 7వ తేదీ సాయంత్రం ప్రత్యేక పూజల ద్వారా వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభిస్తామని అర్చకులు కృష్ణమాచార్యులు తెలిపారు. 8న హంస వాహన సేవ, 9న శేష వాహన సేవ, 10న అశ్వ వాహన సేవ, 11న హనుమంతు వాహన సేవ, 12న గరుడ వాహన సేవ, 13న సింహ వాహన సేవ, 14న చంద్రప్రభ వాహన సేవ, 15న గజ వాహన సేవ, 16న సూర్యప్రభ వాహన సేవ నిర్వహిస్తామన్నారు. ఆఖరి రోజు స్వామివారి శాంతి కల్యాణాన్ని నరసన్నపేట పంచాయతీ కల్యాణ మండపం వద్ద నిర్వహిస్తామన్నారు.

న్యాయ సేవలపై అవగాహన



అవగాహన సదస్సులో పాల్గొన్న జడ్జి రోషిణి

పాతపట్నం: న్యాయసేవలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని పాతపట్నం జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోషిణి అన్నారు. అసంఘటిత కార్మికుల అవగాహన వారోత్సవాల్లో భాగంగా స్థానిక కోర్టు ఆవరణలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతీ కార్మికుడు ఈ–శ్రమ్ కార్డు కలిగి ఉండాలన్నారు. ఆర్థిక స్తోమత అంతగాలేని శ్రామిక వర్గానికి ఉచితంగా న్యాయ సహాయం చేసేందుకు అవకాశం ఉందని, దీనిని శ్రామికులు వినియోగించుకోవాలన్నారు. మహిళలకు ప్రసూతి బీమా సౌకర్యం ఉందని, వారి వివరాలను కార్మిక కార్యాలయంలో నమోదు చేయించుకోవాలని సూచించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూర్యారావు, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

తెంబూరులో ట్రాఫిక్ ఆంక్షలు

పాతపట్నం: తెంబూరు గ్రామంలో చింతలపోలమ్మ గ్రామదేవత ఉత్సవాల సందర్భంగా ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు సీఐ వి.రామారావు సోమవారం తెలిపారు. ఈ నెల 2 నుంచి 6వ తేదీ వరకు ఉత్సవాలు జరగనున్నాయి. 5, 6 తేదీల్లో టెక్కలి, పాతపట్నం నుంచి తెంబూరు వరకే బస్సులు వస్తాయన్నారు. టెక్కలి వెళ్లే ప్రయాణికులు గమనించాలన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

హిరమండలం: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిబిరం కొనసాగుతోంది. అందులో భాగంగా సోమవారం విద్యార్థులకు కుర్చీ, పలు ఆటల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. చదవడం, రాయడంపై అవగాహన కల్పించారు. గ్రంథాలయాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని లైబ్రేరియన్ కె.ఎర్రమ్మ అన్నారు. 40 మంది విద్యార్థులు హాజరుకావడంతో సందడి వాతావరణం నెలకొంది. సహాయ గ్రంథాలయ అధికారి అన్నపూర్ణమ్మ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నిరసన



ఆమదాలవలస: నిరసన తెలుపుతున్న ఏపీటీఎఫ్ ప్రతినిధులు



కొత్తూరు: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

ఆమదాలవలస: ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించాలని ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పేడాడ అప్పలనాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని నిరసన చేపట్టారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలన్నారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు వెంటనే ఓపీఎస్‌ను అమలు చేయాలని, పీఆర్సీ కమిటీని నియమించాలని, 30 శాతం ఐఆర్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ డీఏ బకాయిలను విడుదల చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ రాంబాబుకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర కౌన్సిలర్ బి.చంద్రశేఖర్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ టి.సూర్యనారాయణ, ఆమదాలవలస అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.సుందరరావు, బి.మహేష్, సరుబుజ్జిలి అధ్యక్షుడు ఎస్.రామన్న, టి.విశ్వనాథం, సీనియర్ నాయకులు హెచ్.వి.సత్యనారాయణ, బి.వి.రమణ, పి.సూర్యనారాయణ, పి.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

30 శాతం ఐఆర్ ప్రకటించాలి..

కొత్తూరు: ఉద్యోగులు, ఉపాధ్యాయులకు 30 శాతం ఐఆర్ ప్రకటించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ కె.శాంతారావు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ బాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు. కొత్తూరు, హిరమండలం ఏపీటీఎఫ్ నాయకులు సింహాచలం, గణపతిరావు, బాలకృష్ణ, వేణు, లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

కుట్టుమిషన్ల పేరుతో ప్రభుత్వ ధనం దోపిడీ



రాజాపు అప్పన్న

నరసన్నపేట: బీసీలకు కుట్టు మిషన్ల పంపిణీ పేరుతో టీడీపీ నాయకులు ప్రభుత్వ ధనాన్ని కొల్లగొట్టడానికి పథకం వేశారని కూరాకుల పొందర కార్పొరేషన్ అనుబంధ విభాగం వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రాజాపు అప్పన్న ఆరోపించారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కుట్టు మిషన్ల పంపిణీ, ట్రైనింగ్‌లో భారీ స్కామ్ జరుగుతోందని, దీంట్లో ఏకంగా రూ.167 కోట్లను దోపిడీ చేసేందుకు కూటమి నాయకులు పథక రచన చేస్తున్నారని విమర్శించారు. ఈ పథకంలో టెండర్ల దాఖలు నుంచి కుట్ర జరుగుతోందన్నారు. కుట్టు మిషన్ ఖరీదును అధికంగా చూపించడం, శిక్షణ ఖర్చులు వంటివి మితిమీరి చూపిస్తున్నారన్నారు.

కుట్టు మిషన్ల పథకం అంతా బోగస్ అని, ఈ పథకం పేరుతో ప్రభుత్వ ధనాన్ని కూటమి నాయకులు, కార్యకర్తలకు పంచడమే ప్రధాన ఉద్దేశమని మండిపడ్డారు. దీంట్లో నిజానిజాలు ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. వాస్తవానికి మిషన్ ధర రూ.4,300 కాగా.. దీనికి ప్రభుత్వం రూ.23 వేలు కేటాయించడంతోనే ఎంత డబ్బు తినడానికి ప్లాన్ చేశారనేది తెలుస్తోందన్నారు. కూటమి నాయకుల పన్నాగాలను ప్రతిఒక్కరూ నిలదీయాలన్నారు.

అనుమానితులపై దృష్టి సారించండి

నరసన్నపేట: నరసన్నపేట ప్రాంతంలో ఇతర ప్రాంతాల నుంచి చాలా మంది వచ్చి స్థిరపడుతున్నారని, వారిపై దృష్టి సారించి, వారి వివరాలు సేకరించాలని తహసీల్దార్ సత్యనారాయణను విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు చింతు పాపారావు, టంకాల సూరప్పడు, రామచంద్రరావు, కేఎల్ఎన్ మూర్తి, తదితరులు సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ కొంతమంది వ్యాపారాల పేరిట, మరికొంతమంది స్థానిక ఇస్లాం మతస్తులను కలవడానికి వచ్చి స్థిర నివాసం ఏర్పరుచుకుంటున్నారన్నారు. పలువురి అనుమానితుల వివరాలను సేకరించి వెంటనే వెల్లడించాలని కోరారు. పైఅధికారుల దృష్టికి ఈ విషయం తీసుకువెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హామీ ఇచ్చారని విశ్వ హిందూ పరిషత్ ప్రతినిధులు తెలిపారు.

ఆదమరిస్తే అంతే..



నరసనపేటలోని పంచాయతీ కల్యాణ మండపం కూడలి వద్ద కల్వర్టు పలక ధ్వంసమైంది. భారీ వాహనాలు (లారీలు) రావడంతో పలక విరిగింది. నాలుగు రోజులైనా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. ద్విచక్ర వాహనదారులు ఆదమరిస్తే ప్రమాదం తప్పదు. కల్వర్టు పలకను వెంటనే సరి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

– నరసనపేట